


చల్లటి వాతావరణంలో పిల్లగాలికి చిరు చినుకులు రాలుతుండగా హడావుడిగా గదిలో ప్రవేశించి తలుపు చేరవేసింది సునీత- పాతిక సంవత్సరాల వయస్సులో పరిపుష్టిగా అందం, ఆకర్షణ కలబోసుకున్న సునీత. ఆమె ఆగమనం కోసం అత్యంత ఆత్రంగా ఎదురుచూస్తూ కూర్చున్న రజనీ కాంత్ లోని టెన్షన్ రిలీజయ్యింది.

'ఇంత ఆలస్యం చేస్తే నేనెలా భరించగలననుకున్నావ్ సునీ!' ఆప్యాయంగా ఆమెని లోనికి తీసుకువస్తూ అన్నాడు.

ఆమె కిలకిలా నవ్వింది 'నయం - అసలు వచ్చాను సంతోషించు. ఈ వర్షం పెరిగితే వచ్చేదెలాగా అని ఎంత భయడ్డానో తెలుసా!'

'అమ్మో..' కళ్ళని మరింతగా విప్పారుస్తూ అన్నాడు.

'చెప్పావు కనుక సరిపోయింది. వర్షం పడనీ - తుపానురానీ, అనుకున్న సమయానికి నువ్వురాకపోతే నేను బ్రతికుండగలనా'

అతడి ఆరాధనా భావానికి ఆమె పరవశించి పోయింది. ఫ్లాస్కులో రెడీగా వుంచిన వేడివేడి బోర్నవిటాని అందమైన కప్పులోపోసి ఆమె కందించాడు. కొంత తాను తాగిన తరువాత అతడి కోసం మిగిలింది అందివ్వటం ఆమె అలవాటు. ఆమె బోర్నవిటా తాగుతుండగా, గాలికి చెదిరిన ఆమె కురుల్ని సవరిస్తూ ఆమె పక్కనే నిలబడ్డాడు ఆమెనే తదేకంగా చూస్తూ. ఆమె ఏమేమో కబుర్లు చెప్పి అతణ్ణి నవ్విస్తోంది. ఆమె కపోలాలపై చిందిన వర్షపు చినుకుల్ని సుతారంగా తన నాలుకతో స్పృశిస్తూ అన్నాడు.

'నువ్వుండే కాసేపే నాకు జీవించినట్లు వుంటుంది సునీ.. నువ్వలా వెళ్ళగానే నాలోని జీవం లేచిపోయినట్లనిపిస్తుంది.."

'రజనీ..' అతడిలోని అంకిత భావానికి కదిలిపోయింది. ఎడం చేత్తో అతడి శిరస్సుని ప్రేమగా చుట్టి, కుడిచేత్తో బోర్నవిటాని అతడి నోటి కందించింది. అలా ఒకరి కన్నుల్లోకి ఒకరు చూసుకుంటూడు అతడి తన వాటా బోర్నవిటాని మృదువుగా, మధురంగా సిప్ చేశాడు. 'రజనీ' బలమైన అతడి కౌగిట్లో రబ్బరు బొమ్మలా ఒదిగిపోతుండగా తమకంగా అంది

'అసలు ఎందుకు నన్నిలా ఆకర్షించి పిచ్చిదాన్ని చేశావ్?'

మాటల్తో సమయాన్ని వృధా చేయటం ఇష్టం లేనట్లుగా వుంది అతడిలోని ఆత్రం.

ఆమెలోని అణువణువునీ తన పెదాల్తో స్పృశిస్తూ ఉత్తేజపరుస్తున్నాడు. అతడి పెదాల స్పర్శకి ఆమె ఒక్కోమారు సన్నగా వణికిపోతూంది. అతడు ప్రతిభావంతుడైన వయొలినిస్ట్.

ఆమె అతడి చేతిలో కమాను.

ఆ సమయంలో ఆ గదిలో శృంగారం సంగీతం పరవళ్ళు తొక్కింది.

'సునీ, ఈ అదృష్టం నాకెప్పటికీ అందుబాటులో వుంటుందా!' ఆమె నడుంపైన చేయివేసి పొదివి పట్టుకుని ఆమె నొసటిపైన అలసటకి గుర్తుగా ఏర్పడిన స్వేదబిందువుల్ని కొనగోటితో విదిలిస్తూ అన్నాడు.

ఆ ప్రశ్నకి ఆమె సమాధానం చెప్పలేదు. అలాగే అతణ్ణి హత్తుకుని వుండిపోయింది.

అతడే మళ్ళీ అన్నాడు.

'ఏ రోజైనా నేను నీనుండి దూరం కావలసి వస్తే ..'

అతడి గొంతులో సన్నని జీర.

'రజనీ ..' ఉలికిపడినట్లుగా అతడి శిరస్సుని తన హృదయానికి హత్తుకుంది.

'ఇక వెళ్ళిరానా రజనీ!' కొద్దిసేపు తర్వాత ధరించిన దుస్తుల్ని సవరించుకుంటూ అంది.

'తప్పదుగా ..' తప్పనిసరిగా సరే అనలేక అన్నాడు.

'రేపటి వరకూ మళ్ళీ ఒంటరితనం - నిస్తేజం' అతడి మాటల్లో ఎంతో దిగులు.

'అంతగా దిగులు పడితే ఎలా' అనునయంగా అంది ఆమె.

'అసలు మన మధ్య బంధమే విచిత్రం. ఎవ్వరూ హర్షించలేనిది. నేను వివాహితని. నువ్వేమో నవయువ బ్రహ్మచారివి. ఇలా రోజూ యిక్కడికి వచ్చి ఇంతసేపు గడపటమే ఎంతో యిబ్బంది కాగా, నువ్వింతగా బంధం పెంచుకుంటూ పోతే ఎలా!'

ఒక క్షణం ఆగి ఆమే మళ్ళీ అంది.

'అసలు మన ఈ బంధానికి అవధి ఏమిటో, ఎక్కడో, ఎలాగో ..!'

అతడు సున్నితంగా ఆమె నొసటిపైన చుంబించి వదిలాడు.

'నేను పెళ్ళయిన దాన్నని తెలిసీ, శాశ్వతంగా నేను నీ దాన్ని కాలేనని తెలిసీ నాపై యింతగా ఆరాధనా భావాన్ని పెంచుకుంటున్నావంటే నీ ప్రేమలోని నిజాయితీకి ప్రతిగా నేను నీకేమి చేయగలను!'

వెళ్ళలేక, వెళ్ళలేక అతణ్ణి వదిలి వెళ్ళింది శ్రీమతి సునీత.

ఆమె వెళ్ళిన వెంటనే తొందరగా లేచాడు రజనీకాంత్. నలిగిన పక్కని నీట్‌గా సర్దాడు కొత్త బెడ్‌షీట్లతో.

శుభ్రంగా స్నానం చేశాడు. డ్రస్ ఛేంజ్ చేశాడు.

అట్రాక్టివ్‌గా మేకప్ అయ్యాడు.

గదిలో చక్కటి సుగంధాలు విరజిమ్మే అగరు వత్తులు వెలిగించాడు.

క్రీమ్ బిస్కట్ తీసి నముల్తూ, సిగరెట్ వెలిగించి ప్రేము కుర్చీలో ఫ్రెష్‌గా, ట్రిమ్‌గా, విశ్రాంతిగా కూర్చున్నాడు.

ఇప్పుడతను శ్రీమతి గీత కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు.

శ్రీమతి గీతతో కొన్ని గంటలు -

తరువాత శ్రీమతి ఈశ్వరి - ఆపైన శ్రీమతి అనూరాధ ..

అందరూ శ్రీమతులే. అతడొక పర్వర్ట్. ప్రగాఢ కాంక్షాపరుడు. తనవాంఛని చల్లబరిచేందుకు ప్రకృతి ప్రసాదించిన అందమైన విగ్రహం ఎరగా ప్రేమ అనే వలని విసిరి యువతుల్ని వేటాడుతూ వుంటాడు.

అతడిచే వెంటాడబడిన శ్రీమతులంతా, పెళ్ళయిన తమని తెలిసీ అంత గాఢంగా ఆరాధిస్తున్న అతడి ప్రేమలోని నిజాయితీని ప్రశంసిస్తూనే వుంటారు రోజూ.

అయితే అతడు తనకి వేరే యిబ్బందులు ఎదురు కాకుండా, పెళ్ళయిన యువతుల్ని మాత్రమే తన టేస్ట్‌కి తగినట్లుగా ఎంచుకుని, సిన్సియర్‌గా, ప్రేమనాటకం ప్రారంభించి తమలోని బలహీనత ఆధారంగా తమని దిగజారుస్తాడని వాళ్ళకి తెలియదు.